క్లుప్తంగా

పర్యటన విజయవంతం చేయండి



ఖండవిల్లి భరత్‌కుమార్

రాయవరం: ఈ నెల 11న అఖిల భారత దివ్యాంగుల దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు పర్యటనను విజయవంతం చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. రాయవరంలో ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, రామచంద్రపురం, కాకినాడలో జరిగే సమావేశాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. జిల్లా, మండల స్థాయి, దివ్యాంగుల సంఘ నాయకులు, ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నాగేశ్వరరావు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆదివారం తెలిపారు. కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఉదయం 7.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటలు వరకూ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కాపులపై కక్ష కట్టిన కూటమి

కపిలేశ్వరపురం: కాపు గర్జన పేరిట 2016లో ఛలో తుని ఘటనలో నమోదు చేసిన కేసులను తిరగతోడుతూ కాపులకు అన్యాయం చేయదలిస్తే కూటమి ప్రభుత్వాన్ని సహించేది లేదని వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్, నాయకులు గూటం సత్యనారాయణ, పాలింగి శ్రీను, పీతల బంగారం, నేలపూడి శ్రీను మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. ఒక సామాజిక సమస్య పరిష్కారంలో భాగంగా కాపు సామాజిక వర్గీయులు పోరాడారని వారిపై నమోదు చేసిన కేసులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 మే 1 తొలగించిందన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సంక్షేమ పాలనకై వినియోగించకుండా కూటమి ప్రభుత్వం సామాజిక సమస్యలను సృష్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తాలేక ప్రజలను ఏమార్చుతున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాపులపై కేసులను తిరగతోడి విచారణ చేయాలంటూ జీవో నెంబర్ 852 విడుదల చేయడం కాపులకు అన్యాయం చేయడమే అని కిశోర్ తదితరులు వేదన వ్యక్తం చేశారు.


యోగాంధ్ర విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీడీఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సోలో యోగా, మెడిటేషన్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, రంగోలి పోటీల విజేతలకు మంగళవారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే చర్యలు తప్పవు



మండపేట పట్టణ దుకాణంలో తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): బాలలను పనిలోకి పెట్టుకుంటే చట్ట పరిధిలో చర్యలు తీసుకోక తప్పదని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివనాగ మల్లేశ్వరరావు హెచ్చరించారు. వ్యాపార దుకాణాల్లో బాలకార్మికులను గుర్తించే లక్ష్యంతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖ సీఆర్‌పీ శేషగిరిరావు, ఏఎస్సై వెంకటేశ్వరరావు, అలెర్ట్ ఎన్జీవో సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌లతో కలసి దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల నిర్వాహకులకు బాల కార్మికుల చట్ట నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలలను పనిలోకి పెట్టుకున్న వారికి రూ.50 వేలు, జరిమానా కట్టడంతో పాటు పనిలోకి పెట్టుకున్న బాలుని పేరున రూ.20 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. దానికి తోడు జైలు శిక్ష సైతం అమలవుతుందన్నారు.

ఎన్నికలకు గొప్పలు.. వచ్చాకా లెక్కలు

- ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ పాలనపై దుష్ప్రచారం
- గెలిచేందుకు ఇబ్బడిముబ్బడిగా హామీలు
- అసంబద్ధమైన అంశాలతో ఏమార్పు
- ఏడాది పాలనలోనే వెన్నుపోటు
- అందుకే నేడు 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసనలు



విద్యుత్ చార్జీల పెంపుపై మండపేటలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ప్రజలు (ఫైల్)

కపిలేశ్వరపురం: రాజకీయాలంటే ఎంతో నిబద్ధతతో ఉండాలి. గెలుపుఓటములను ప్రజలకు వదిలేయాలి. గెలిపిస్తే ఐదేళ్లూ వారికోసమే పని చేయాలి. ఓడితే సమస్యలపై పోరాడుతూ ఓపికతో మరోసారి ప్రయత్నించాలి. ఇది విలువలతో కూడిన భారత రాజ్యాంగ సారాంశం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి పాలకులకు ఇవేమీ పట్టవు. మంచి చేస్తున్న పాలనను దుష్ప్రచారం చేసైనా దించేయాలన్నది లక్ష్యంగా కొందరు పని గట్టుకుని ప్రజలను ఏమార్చారు. గత పాలన తొలిదశలో డబ్బులను పంచేస్తున్నారంటూ ఏడ్పు...ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అంతకంటే ఎక్కువ ఇస్తామంటూ ఏమార్పు.. ఇవీ అప్పటి ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎన్నికల వ్యూహం. ఇందులో ఎక్కడా ప్రజాకోణం లేదు. కేవలం సంక్షేమాన్ని ఇంటి తలుపుల వద్దకు దరిచేర్చిన వైఎస్సార్ సీపీ పాలనను దించి వారు గద్దెనెక్కడమే లక్ష్యంగా గుంపుకట్టారు. దానికి అందంగా పెట్టుకున్న పేరే 'కూటమి' కారణాలేమైనా కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. విచిత్రమేమంటే వారందరినీ కూటమి అధికారంలోకి వచ్చినా కొనసాగిస్తామని, వేతనాలను రెట్టింపు చేస్తామని పవన్ కల్యాణ్, చంద్రబాబు హామీలను ఇచ్చారు. అందుకే వారిది కచ్చితంగా వెన్నుపోటు పాలనే..అందుకే నేడు ప్రజలు వెన్నుపోటు దినం పేరుతో నిరసనకు సన్నద్ధమవుతున్నారు.

నోటి మాటలు నీటిమూటలు

2024 మార్చి 9న రామచంద్రపురం రూరల్ హసన్‌బాదలోనూ, ఏప్రిల్ 3న ద్రాక్షారామలోనూ, జనవరి 20న మండపేట పట్టణం, ఏడిదలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో పలు హామీలను ఇచ్చారు. ఏప్రిల్ 26న ద్రాక్షారామ సభలోనూ, మే 1న మండపేట సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి హామీలకు తాను హామీ ఇస్తున్నానంటూ గట్టిగా చెప్పారు. వారిద్దరికీ బీజేపీ నేతలు తోడయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్ల పొట్టకొడుతూ ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. వారు ప్రకటించిన అనేక పథకాలకు కార్యాచరణ లేని పరిస్థితి నెలకొంది. 2024 మే 1న పవన్‌కల్యాణ్ మండపేటలో మాట్లాడుతూ జగన్ పాలన నుంచి విముక్తి కలిగించడానికి కూటమి కట్టానన్నారు. కూటమి కట్టి ఆ హామీలను గాలికి వదిలేశారని కూటమి సంవత్సరానికే నిరూపించింది. రాష్ట్రంలో 30వేల మంది మహిళలు అదృశ్యమైపోతే జగన్ కనీసం ప్రెస్‌మీట్ కూడా పెట్టలేదన్నారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యి ఏడాది కాలమైనా ఇప్పటి వరకూ అదృశ్యమయ్యారన్న మహిళల ఊసెత్తలేకుండా తాను చెప్పిన అబద్దాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి, కేదారిలంక, కోరుమిల్లి ఇసుక ర్యాంపులు నుంచి నెలకు జగన్‌కు రూ.10 కోట్లు వెళ్లిపోతుంది. అదే డబ్బుతో మీ ఓట్లు కొంటున్నారన్నారంటూ ప్రజలను ఏమార్చారు. కూటమి పాలన ప్రారంభమైన కొద్ది రోజులకే కూటమి నాయకులు కపిలేశ్వరపురం గోదారి గట్టుపై ఉన్న ఇసుక నిల్వలను దోచేశారు. ఇప్పటికీ భారీ వాహనాల్లో ఇసుకను దోచేస్తూనే ఉన్నారు.

ఏడాదికే ప్రజలకు వెన్నుపోటు..

ప్రజలు ఐదేళ్ల కాలపరిమితిలో అధికారాన్ని ఇస్తారు. ప్రస్తుత కూటమికి ఇప్పటికే దాదాపు ఏడాది పూర్తయ్యింది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన అనేక హామీలను అధికారంలోకి వచ్చాకా తుంగలోకి తొక్కారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు సంగతి ఎలా ఉన్నా ఎండీయూ వాహనాలు, వలంటీర్ల ద్వారా ఉపాధి పొందుతున్నవారిని ఊడపీకేశారు. ఉద్యోగం వచ్చే వరకూ నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇప్పటి వరకూ కార్యాచరణ లేనే లేదు. పాఠశాలకు వెళ్లే పిల్లలు ఇంటిలో ఎంత మంది విద్యార్థులంటే అంత మందికి రూ.15వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో ఆర్థిక సాయమందిస్తామన్నారు. ఇప్పటికి ఏడాది చదువు పూర్తైనా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. రైతుకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ పేరుతో రైతు కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయమందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వమిచ్చే సాయం తప్ప, ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. సోలార్ పరికరాలను సమకూర్చి కరెండు బిల్లు లేకుండా చేస్తామన్నారు. ఇప్పటికి అనేకమార్లు కరెంటు చార్జీలను పెంచారు.

మళ్లీ నువ్వే రావాలి జగన్

మనిషి ఆశా జీవి. తన జీవన పరిస్థితులను కుటుంబ ఆర్థిక పరిస్థితులను నిరంతరం మెరుగుపర్చుకోవాలన్న ఆశతో జీవిస్తాడు. అధికారంలో ఉన్నవారు సంక్షేమాన్నే అమలు చేస్తున్నా అంతకంటే ఎక్కువ ఇస్తానన్న వారిని నమ్మడం సహజసిద్ధమైనది. కూటమి నేతలు చూపించిన అద్దంలో అద్భుతానికి ఆకర్షితులైన ప్రజలు కూటమికి అధికారాన్ని ఇచ్చారు. ఏడాదిరలోనే వారి వైఖరిలో భిన్నత్వం కనిపిస్తోంది. మండపేటలో రైతులు తమ ధాన్యాన్ని కొనాలంటూ రోడ్డెక్కారు. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు కొద్ది రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్నారు.

నేడు నిరసన కార్యక్రమాలిలా..

మండపేట పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రసంగిస్తారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారి మీదుగా రాజారత్నం సెంటర్, బస్ స్టాండ్, కలువ పువ్వు సెంటర్, కేపీ రోడ్డు మీదుగా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. తహసీల్దార్‌కు ఎన్నికల హామీలను అమలు చేయాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు.

వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి తరలిరండి

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: రాష్ట్ర ప్రజలను సూపర్‌సిక్స్ పేరుతో నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం వైఫల్యంపై నిరసన వ్యక్తం చేసేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ మంగళవారం పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వెన్నుపోటు దినం నిరసనలో భాగంగా స్థానిక గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించటం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావచ్చినా ఇప్పటివరకు సూపర్ సిక్స్‌ను అమలు చేయకపోవటం ప్రజలను వెన్నుపోటుకు గురిచేయడమేనని సూర్యప్రకాశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసపూరిత విధానాలను ఎండగడుతూ ప్రజల తరఫున పోరాటం చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు



వెంకటాయపాలెంలో ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న అర్జున్

కపిలేశ్వరపురం: ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శిగా నియమితులైన ఏడిద గ్రామానికి చెందిన వాసిరెడ్డి అర్జున్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకం అనంతరం తొలిసారి వెంకటాయపాలెం వెళ్లి మంగళవారం ఎమ్మెల్సీ తోటను సత్కరించారు. యువజన విభాగంలో తనకు అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ తోట అడుగుజాడల్లో ప్రజలు కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుపూడి రాంబాబు, వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, తాతపూడి రాజేష్, కొండేటి కాశీకృష్ణ, రాగాల వెంకటరమణ, రామిశెట్టి శేఖర్, శాకా సత్యనారాయణ, పువ్వల నాని పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ



ద్రాక్షారామలో హనుమాన్ చాలీసా గానంతో అలరించిన అక్కిరాజు బృందం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న సప్త సప్తాహ మహోత్సవంలో భాగంగా మంగళవారం ప్రముఖ గాయకుడు, జూనియర్ ఘంటసాలగా పేరు పొందిన రామచంద్రపురానికి చెందిన అక్కిరాజు, అతడి బృందం ఆలపించిన హనుమాన్ చాలీసా భక్తులను విశేషంగా అలరించింది. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని అక్కిరాజును దుశ్శాలువా, పూలదండతో సత్కరించారు. పలు భజన బృందాలు తమ గానాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, దాతలు సత్తి సుబ్బారెడ్డి, మంచెం చిన్నబాబు, కైరం వీరవెంకట సత్యనారాయణ(సతార్ స్వామి) తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చొరవతో పనిచేయాలి



మండపేట మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో చొరవతో పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ మూర్తి సమావేశం అజెండాను వివరించారు. అనంతరం శాఖలవారీగా అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. ద్వారపూడి, ఏడిద సీతానగరం తదితర గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించక పోవడంపై అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో సభ్యులు కోరిన పనులపై అధికారులు చర్చించి ప్రతిపాదనలు చేయకపోవడం సరికాదన్నారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన ప్రతీ అంశాన్ని సంబంధిత అధికారులు తీవ్రంగా పరిగణించి సకాలంలో పరిష్కరించాలన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యూటీఎఫ్ మద్దతు



మండపేట మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట 12 రోజులుగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔటర్ సోర్సింగ్ కార్మికులకు మంగళవారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ నాయకుడు కె.గోపాలకృష్ణారెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు పి.రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజేంద్ర, కోశాధికారి ఎం.శ్రీనివాస్, నాయకులు పీకేఎల్ రెడ్డి మంగళవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు.

బహిరంగ వేలం ఖరారు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో కొలువైన సోమేశ్వర స్వామికి చెందిన భూములను మంగళవారం దేవదాయ-ధర్మాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. మండల దేవదాయ-ధర్మాదాయ శాఖ అధికారి, కోటిపల్లి సోమేశ్వర స్వామి ఆలయ ఈఓ భీమశంకరం సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో స్వామికి చెందిన 3.56 సెంట్ల భూమిని మూడేళ్ల కాలపరిమితికి రూ.1.60 లక్షలకు గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనివాస్ హెచ్చుకు పాడుకున్నారు. ఆలయ అర్చక సింగిల్ ట్రస్టీ వెలవలపల్లి సుబ్బారావు, దేవస్థాన సిబ్బంది శ్రీను, నాగేశ్వరరావు, విత్తనాల శ్రీను, గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కాజులూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని సమయాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఒంటితాడి, శీలలంక, మంజేరు, శీల తదితర గ్రామాల్లో కార్మికసంఘం నాయకులు పర్యటించి ఉపాధి వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని సమయాల్లో గతంలో ఎండకు మజ్జిగ, టెంట్లు, సరఫరా చేసేవారన్నారు. ప్రస్తుత పాలనలో తగిన సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, అవసరమైన పనిముట్లు సైతం అందుబాటులో ఉండటం లేదన్నారు. అధికారులు స్పందించి ఉపాధిహామీ కూలీలకు పని సమయాల్లో తగిన సామగ్రి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్ శ్రీనివాసులు, సంఘ నాయకులు పి.కృష్ణ, ఎం.చల్లారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

9న యోగా ఈవెంట్‌ను విజయవంతం చేయాలి



భీమేశ్వరాలయంలో యోగా ఈవెంట్ ఏర్పాట్లపై పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం రూరల్: ఈ నెల 9న ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న యోగాసనాల గ్రాండ్ ఈవెంట్‌ను విజయవంతం చేయాలని ఆర్డీఓ దేవరకొండ అఖిల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె మంగళవారం భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాట్లపై పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, దేవాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

రాయవరం: ఖరీఫ్ వరిసాగు నిమిత్తం రైతులకు వ్యవసాయ శాఖ తరపున వరి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ మంగళవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో స్వర్ణ రకం 60 క్వింటాళ్లు, ఎంటీయూ 1,318 రకం విత్తనాలు 10 క్వింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో 80 క్వింటాళ్లు స్వర్ణ రకం, ఎంటీయూ 1,389 రకం వరి విత్తనాలు 30 క్వింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు.

అవగాహనతోనే క్షయ నివారణ



కపిలేశ్వరపురం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రత్నకుమారి, సిబ్బంది

కపిలేశ్వరపురం: అవగాహననే ఆయుధంతో క్షయ వ్యాధిని నివారించవచ్చని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ శిరీష అన్నారు. టీబీ, ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై మంగళవారం కపిలేశ్వరపురంలో సర్పంచ్ శాకా శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత టీబీ ఫ్రీ ఇండియా నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ‹టీబీ హారేగా దేశ్ జీతేగా› అంటూ నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. వైద్యులు రత్నకుమారి, శిరీష మాట్లాడుతూ శరీరం అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, తుల్లి పడటం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయ వ్యాధి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ నెల 2 నుంచి ఆగస్టు 30 వరకూ క్షేత్ర స్థాయిలో టీబీ ముక్త, భారత్ అభియాన్ అవగాహన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరావు, ఎస్‌టీఎస్ రమణ, ఎంఎల్‌హెచ్‌పీలు మానుషా, దివ్య, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఝాన్సీ, శిరోమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో కీర్తి స్పందన

రాయవరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు రంగవల్లులు, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కీర్తి స్పందన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేది వరకు 13 రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో రిజిస్టర్ కావాలన్నారు. యోగా సాధన వలన కలిగే ఉపయోగాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, మహిళలు రంగవల్లుల వేశారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ దొరరాజు

రాయవరం: మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించక పోవడం వలన ప్రమాదాల్లో అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. మండలంలోని మాచవరం వంతెన వద్ద మంగళవారం రహదారి ప్రమాదాలపై వాహనదారులకు ఎస్సై సురేష్‌బాబుతో కలసి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు వీలవుతుందన్నారు. తద్వారా కుటుంబానికి ఆధారం కోల్పోయే పరిస్థితి తప్పుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వారి వెంట ఉంచుకోవాలన్నారు. కాలపరిమితి ముగిసిన వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదన్నారు. అలాగే తల్లిదండ్రులు మైనారిటీ తీరని పిల్లలకు వాహనాలు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన కల్పించడంతో పాటుగా, హెల్మెట్ లేని వాహనదారులతో అక్కడికక్కడే హెల్మెట్స్ కొనిపించి, వాటి ఆవశ్యకతను వివరించారు.

మలేరియాను నిర్మూలిద్దాం

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలిద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎన్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.